# ఎఱ్ఱ గులాబీలు

ఒకరోజు పొద్దున్న నేను హాల్లో కూచుని పేపరు చూస్తున్నాను. గేటు తెరచిన చప్పుడైంది. వరండాలోకి వచ్చాను. ఒక వ్యక్తి సన్నగా, ఎఱ్ఱగా, పొడుగ్గా వున్నాడు. గబగబా నడిచి వచ్చాడు నావైపు. అతని వాలకం చూస్తే ఆతృత పడుతున్నట్లున్నది. నేను యెవరికోసం అని అడిగేలోపునే అతడు మాట్లాడాడు.

"మీ బాల్కానీమీద పూసే ఎఱ్ఱ గులాబీలు రెండు కావాలండీ. మా చెల్లెలికి పదిహేను రోజులుగా జ్వరం వస్తోంది. మొన్నటినుంచి ఎఱ్ఱగులాబీ పూలకోసం కలవరిస్తోంది. ఎక్కడో ఎప్పుడో చూసిందట. కావాలని కూర్చుంది. బజారంతా తిరిగాను. ఎక్కడా దొరకలేదు. మీరు రెండు పూలిస్తే...." దీనంగా చూశాడు.

నాకు మనస్సు వప్పటంలేదు ఆ పూలు కోసి యివ్వటానికి. నాన్నగారు బెంగుళూరునుంచి తెప్పించినఅంట్లు అవి. మూడు మొక్కలూ ఈ యేడాదే పూస్తున్నాయి. ఎంతో అందంగా వున్నాయి. ఆ పూలు నేనయినా ఎప్పుడో గాని కొయ్యను. అలాంటిది ఈ అపరిచిత వ్యక్తికి యివ్వాలంటే మనస్సు వప్పటంలేదు. నేను సందేహించటం గ్రహించాడతను.

"పూలు లేకుండా యింటికి వెళ్ళడం అంటే భయం వేస్తోందండీ. 'అన్నయ్యా తెచ్చావా ?' అంటుంది. మనస్సు చివుక్కుమంటుంది. ఏ పార్కులోనూ నాకు తెలిసినవాళ్ళు లేరు. పోనీ ఒక్క

పువ్వన్నా....?'' చెల్లెలు పంచప్రాణాలు ఆ పూలమీద పెట్టుకుందన్నట్టుగా మాట్లాడుతున్నాడతను. నా ఆలోచనేమిటి ? గబగబ మేడమీదకు వెళ్ళాను. బాల్కానీ మీద పూలు గాలికి అందంగా ఊగుతున్నాయి. పెద్ద పువ్వు ఒకటి కోసుకొచ్చి అతనికిచ్చాను. నాలో యెక్కడనుంచో ఔదార్యం పుట్టుకొచ్చింది. "మీ చెల్లెలు జ్వరం తగ్గే వరకూ రోజూ ఒకపువ్వు కోసి యిస్తానులెండి" అన్నాను. అతను చిరునవ్వుతో పువ్వు తీసుకుని వెళ్ళిపోయాడు.

నాలుగు రోజులు వరసగా వచ్చాడతను. పూలు తీసుకెళ్ళాడు. వాళ్ళ చెల్లెలు యెంత ఆనందం చూపుతున్నదో చెప్పాడు. ఆ పువ్వుని చేతిలో పెట్టుకునే నిద్రపోతుందిట.

ఒక ఉదయం అతను రాలేదు. నేను హాల్లోనే కూర్చుని ఉన్నాను. గడియారం ఎనిమిది కొట్టింది. కానీ అతను రాలేదు. ఒకమాటు వరండాలోకి వెళ్ళి చూశాను. నాకు సిగ్గేసింది. ఎందుకు నాకి ఆదుర్దా అని. కాని కాస్సేపాగి పైకి వెళ్ళి బాల్కానీమీదనుంచి చూశాను. అతని జాడ లేదు. ఏమయ్యాడతను ? ఆ చెల్లెలు ఎలాగుందో !

నాకు చటుక్కున ఓ ఆలోచన తోచింది. ఇతనికి నిజంగా చెల్లెలుందా ? ఇతను చెప్పిందంతా నిజమేనా ? కాక పోవచ్చు. జ్వరంవస్తే పిల్లలు పూలకోసం కలవరిస్తారా? కలవరించినా పెద్దవాళ్ళు మరిపిస్తారు గాని యిలా ఊళ్ళో అందరి ఇళ్ళకూపోయి పూలు తీసుకొస్తారా ? అంతా అబద్ధంగా, అసంబద్ధంగా తోచింది నాకు. మరెందుకు వస్తున్నట్టు అతను ? అసలు పూలకోసమేనా ? అంతగా పూలు కావలసి వస్తే కొనుక్కోలేడూ ? తనే ఎందుకు వస్తాడు రోజూ ? ఎవరినైనా పంపడూ ? ఈ కాలం కుర్రవాళ్ళు అసాధ్యులు. నవలలు, కథలు చదివి ఆడపిల్లలతో పరిచయాలు కలిగించుకోవటానికి కొత్త కొ

మూర్ఖాలు కనిపెడుతున్నారు. ఇదొక రకం కావచ్చు. రేపు రాగానే చెప్పేస్తాను - 'పూలు యివ్వడానికి వల్లకాదని.'

హాల్లోకి వచ్చి మళ్ళీ పేపరు చూడటం మొదలెట్టాను. అతని ముఖం జ్ఞాపకం వచ్చింది. వాడిపోని చిరునవ్వు, ఆ కళ్ళు - తమాషాగా వాలుస్తాడు రెప్పల్ని. చాలా నీటుగా వున్నాడు మనిషి మాత్రం. ఐనా నాకెందుకు అతన్ని గురించి ఆలోచన.

మర్నాడు వచ్చాడతను. అతను వచ్చేవరకూ తహ తహ లాడానేమో అనిపించింది. ఏమిటి నాలో మార్పు ? పొద్దున్నే లేచినప్పటినుంచి అతని రాకకోసమే చూస్తున్నానా నేను ? అతని కా పూలు యివ్వటం, అతని చిరునవ్వులు అందుకోవటం యిదంతా అలవాటయిపోతోందా ? లేకపోతే నా కెందుకీ తహ తహ ! పొద్దున్నే స్నానంచేసి కొత్త గులాబీ చీర కట్టుకున్నాను. ఒకటికి రెండుసార్లు అద్దంలో చూచుకున్నాను. ఎర్రగులాబీ పూలు కోసి తల్లో పెట్టుకున్నాను.

అతను వచ్చాడు. లోపలికొచ్చి కూచోమని ఆహ్వానించాను. అతను చాలా సరదాగా మాట్లాడాడు. మధ్యమధ్య చాలా అందంగా నవ్వుతాడతను.

పదిరోజులు గడిచాయి.... నాలోమార్పు నాకవగాహన కావటం మొదలెట్టింది. నా అలంకరణలో శ్రద్ధ ఎక్కువ చూపుతున్నాను. పూలు కోయటం ఎంతో బాధగా అనిపించేది నాకు. ఇప్పుడదో సరదా అయిపోయింది. అతని రాక తప్పనిసరి సంఘటనైంది. అతను నా పరిచయంకోసమే వస్తున్నాడన్నమాట నేను ఖాయపరుచుకున్నాను. కాని అది తప్పేమో అన్న ఆలోచన రాలేదు నాకు. ఎప్పుడో

ఒకప్పుడు చెప్పకపోతాడా అనుకున్నాను. అప్పుడే అతడ్ని మందలిద్దామని అనుకున్నాను. కానీ—నే నతడ్ని ప్రోత్సాహం చెయ్యటం లేదూ? ...ఏమో !....

హఠాత్తుగా అతను రావటం మానేశాడు. వరసగా వారం రోజులు రాలేదు. పొద్దున్నంతా కలతగా గడిచేది నాకు. ఏదోకొరతగా అనిపించేది. ఎందుకు రాలేదతను ? నాన్నగారుగాని మరెవరైనా గాని మందలించలేదుకదా ? ఎవరూ చూసే అవకాశం లేదే ! పొద్దున్న పూట హాల్లో యెవరూ వుండరు. అతనికే ఏమైనా జబ్బుచేసిందేమో ! నా గుండె దడదడ కొట్టుకుంది. అతనెక్కడుంటాడో ఏంచేస్తాడోకూడా కనుక్కోలేదు. కానీ, అతడు వస్తాడు, యెప్పుడో. అతడు నిజంగా పూలకోసం వస్తేగా ! నా ముఖాన చిరునవ్వు విరిసింది. గర్వపడ్డానేమో అనిపించింది.

మర్నాడు నాపేర కవరు వచ్చింది. అపరిచితమైన దస్తూరి. ఎవరిదో అనుకుంటూనే విప్పాను. అతనే ! !

కుమారిగారికి—

"నేను హఠాత్తుగా కనిపించకపోవడం మీకు ఆశ్చర్యం కలిగించి వుండవచ్చు. మీకు నేను క్షమాపణ చెప్పుకోవాల్సిన అవసరం యెంతైనా ఉంది. మీకు చెప్పినట్టుగా నాకు చెల్లెలు లేదు. మా యింట్లో జ్వరం ఎవరికీ రాలేదు. ఎర్రగులాబీలకోసం కలవరించిన మాటకూడా అబద్ధమే. మరెందుకొచ్చానంటారా ? అదేమో ? ఇక్కడే నేను మీకు క్షమాపణ చెప్పుకోవాలి..." నా మనసు ఆనందంతో నిండుతోంది. అసలు సంగతి చెబుతున్నాడు. [illegible] గబ గబా చదవ సాగాను.

"నేను ఒక సంవత్సరంగా పిచ్చివాడినై తిరుగుతున్నాను, ఒక పిల్లమీద ప్రేమతో. ఆ చంచలాక్షి క్రిందటి నెలలోనే నన్ను కటాక్షించింది. మాటల సందర్భంలో తనకి ఎర్రగులాబీ పూలంటే చాలా ఇష్టమని చెప్పింది. అవి సంపాదించి ఇచ్చి ఆమె వదనంమీద చిరునవ్వు చూడామని కోరిక కలగటం సహజం. ఎక్కడ దొరుకుతాయి, ఈ అపురూప పుష్పాలు ? రోజూ సైకిలుమీద ఇలాపోతూ మీ బాల్కనీవైపు చూసేవాడిని. ఈ పూలు నన్ను ఆకర్షించాయి. ఒకటి రెండుసార్లు మిమ్మల్ని కూడా చూశాను మేడమీద. ఎలాగైనా పూలు సంపాదించాలని కథ అల్లాను. మీలాంటివారి హృదయం తేలిగ్గా కరిగించవచ్చని ఆశించాను. మీరు నమ్మారు; పూలు ఇచ్చారు. నా దేవత చాలా చాలా ఆనందించింది. మా పెళ్ళికూడా నిశ్చయమైంది. మీతో ఇవన్నీ ముఖతః చెప్పే సాహసం లేకపోయింది. మీరు నన్ను క్షమించాలి. మీ బాల్కానీమీద పూలంత అందమయిన పూలు నే నెక్కడా చూడలేదంటే అతిశయోక్తి కానేరదు. అంత చక్కని పూలు పూయిస్తున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. నన్ను క్షమించండి."

నా చేతిలోంచి పడిపోయింది ఉత్తరం. సోఫాలో కూలబడ్డాను. నిశ్చేష్టితంగా గోడవంక చూడసాగాను. నా మనస్సులో ఒక మూల నుంచి ఏదో ఆవేదన, బాధ పొడసూపింది. గిల గిల లాడాను కాసేపు అర్థంకాని ఆవేదనతో. నే నెందుకని బాధపడుతున్నాను ? అతనంటే నా మనసు "ప్రేమ" వంటి భావాన్ని పెంచుకుంటోందా ? అప్పుడర్థం కాలేదు నాకు.

ఆ రాత్రి మేడమీద గదిలో అద్దంముందు నిల్చున్నాను. నా కళ్ళు మెరుస్తున్నాయి. కంఠం, బుగ్గలు, నుదురు అన్నీ కాంతితో శోభిస్తున్నాయి. నా చెక్కిళ్ళమీద అరుణ కాంతులు నన్నే ముగ్ధపరి

చేట్టుగా ఉన్నాయి. నే నందమైనదాన్నే. నే నెందుకు అంతగా బాధ పడ్డాను ప్రొద్దున్న ?

అతనంటే యిష్టమా నాకు? ఏమో...! కాదు...నేను హతాశు రాలిని ఐనాను. నాకు తెలియకుండానే అతడ్ని నే నాహ్వానించాను. నాలో నేనే ఏదో మార్పులు కలిగించుకున్నాను. ఏదో జరుగుతుందనీ, అతను పిచ్చివాడల్లే నా వెంటపడ్డాడనీ వూహించుకున్నాను.ఒక ప్రణయం సాగుతుందనుకున్నాను. అదంతా జరగలేదు. అతను నా కోసం రాలేదు. ఆ విషయం నాకతను తెలియచేయక పోయినా బాగుండేది. ఇప్పుడు నా స్వాభిమానం దెబ్బతిన్నది. అందుకే ఏడ్చాను నేను. అందుకే !

ముందుకు వంగి అద్దంలో చూసుకున్నాను.

నే నందమైనదాన్నే. కానీ - గిరుక్కున అద్దంమీద కర్టెను లాగేసి వెనక్కి తిరిగాను.